ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 9 జూలై 2024

ఏడుగురి హెచ్‌సీలకు పదోన్నతి

శ్రీకాకుళం క్రైం, జూలై 8: జిల్లాలో ఏడుగురు హెడ్ కానిస్టేబుల్స్‌కి ఏఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ కె.ఆనందరావును కాశీబుగ్గ పీఎస్‌కు, హెచ్‌సీ ఎం.బాలకృష్ణను టూటౌన్‌కు, హిరమండలం హెచ్‌సీ బి.గోవిందరావును కొత్తూరుకు, మెళియాపుట్టి హెచ్‌సీ ఎల్.అప్పారావును పాతపట్నానికి, సీసీఎస్‌లో పని చేస్తున్న హెచ్‌సీ చంద్రరావును కోటబొమ్మాళి ఏఎస్‌ఐగా నియమించారు. జిల్లా నుంచి విజయనగరం, విజయవాడల్లో పనిచేస్తున్న హెచ్‌సీలు కేవీ రమణమూర్తి, వై.మురళీకృష్ణకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించగా, వీరికి ఇంకా పోస్టింగ్ ఇవ్వాలి.

ఉచిత ఇసుక ప్రారంభం

ఇసుక కోసం రోజంతా నిరీక్షణ

టెక్కలి: టెక్కలిలో ఇసుక కోసం ట్రాక్టర్ డ్రైవర్లు రోజంతా నిరీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందించి.. సోమవారం నుంచి నిర్దిష్ట ధరకు ఇసుకను విక్రయించనున్నట్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచే స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ సమీపంలో ఇసుక నిల్వలు కేంద్రం వద్ద వందల సంఖ్యలో ట్రాక్టర్లు బారులుదీరాయి. కాగా.. సాయంత్రం వరకూ ఇసుక ప్రక్రియ విక్రయాలు ప్రారంభం కాకపోవడంతో ట్రాక్టర్ల డ్రైవర్లు అసహనానికి గురయ్యారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే ఇసుక విక్రయాలు చేపడతామని గనులు, భూగర్భశాఖ సహాయ సంచాలకులు ఫణిభూషన్‌రెడ్డి, ఆర్ఐ గణేష్, టీపీ నాగేంద్ర తెలిపారు.

- తొలిరోజున ఒక ట్రాక్టర్‌తో తరలింపు
- అంగూరులో మాత్రమే అమ్మకం
- టెక్కలిలో నిరీక్షించిన నిర్మాణదారులు
- సాయంత్రం విడుదలైన ఉత్తర్వులు

శ్రీకాకుళం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత ఇసుక విధానం ప్రారంభమైంది. కాగా.. ఉత్తర్వులు ఆలస్యం కారణంగా తొలిరోజు కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక కష్టాలు తీవ్రతరం కావడంతో.. వాటన్నింటినీ రద్దుచేసి ఎన్డీయే కూటమి కొత్త పాలసీని ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వ ఉత్వర్వులు విడుదల కావడం ఆలస్యం వల్ల ఇసుక పంపిణీకి నిర్మాణదారులు తొలిరోజున తీవ్రంగా నిరీక్షించారు. జిల్లాలో టెక్కలి, అంగూరు లలో ఇసుక డిపోలు ఉన్నాయి. ఈ రెండు డిపోల్లో 62వేల టన్నుల ఇసుక లభ్యంగా ఉంది. అయితే సోమవారం నుంచి ఇసుక అందుబాటులోకి వస్తుందని.. టన్ను ఇసుక కేవలం రూ.340 మాత్రమే అని అధికార యంత్రాంగం ప్రకటించింది. దీంతో నిర్మాణదారుల్లో సంతోషం నెలకొంది. కొంతమంది ట్రాక్టర్లను బాడుగకు తీసుకుని ఇసుక డిపోల వద్ద మకాం వేశారు. కానీ సోమవారం సాయంత్రం జీవో విడుదలైంది. అప్పటికే భారీస్థాయిలో ట్రాక్టర్లను లైన్లలో ఉంచిన నిర్మాణదారులు ఎదురుచూశారు. కానీ ఇసుక విక్రయాలను పూర్తిస్థాయిలో ప్రారంభించలేక పోయారు. కేవలం కొత్తూరు మండలం అంగూరులో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవింద రావు ఇసుక విక్రయాన్ని లాంఛనప్రాయంగా ప్రారంభించారు. కేవలం ఒక ట్రాక్టర్ ఇసుకను మాత్రమే విక్రయించారు. ఇక టెక్కలి డిపో నుంచి ఇసుక విక్రయాలు చేపట్టలేక పోయారు. సమయం కుదరక పోవడం.. జీఓ విడుదలైనంతవరకు వేచి ఉండాలంటూ ముందుగానే అధికారులు చెప్పడంతో.. ఇక్కడ నిర్మాణదారులు అవస్థలు పడ్డారు.

● 'తొలిరోజున ఒక ట్రాక్టర్ ఇసుకను మాత్రమే అంగూరులో విక్రయించాం. టెక్కలిలో విక్రయాలు చేపట్టలేదు. మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో విక్రయాలు జరుగుతాయ'ని భూగర్భ వనరులశాఖ ఉపసంచాలకులు సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.


టెక్కలిలో బారులుదీరిన ట్రాక్టర్లు


కొత్తూరు : అంగూరులో ఇసుకను డంప్ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఇక కార్మికులకు ఉపాధే

- పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

కొత్తూరు: కొత్తూరు మండలం అంగూరు ర్యాంప్‌లో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు.. ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం గృహ నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేసింది. ఇకపై భవన నిర్మాణ రంగం కొత్త పుంతలు తొక్కుతుంది. లక్షలాది మంది కార్మికులకు ఉపాధి దొరకనుంది. పేదలకు సొంతింటి కల నెరవేరనుంది. రాష్ట్రంలో ఇసుక కొరత ఇక ఉండదు. ప్రజావసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయి. ఎన్నికల హామీ మేరకు నెలరోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసింది. ఇసుకను నామమాత్రపు ధరకే ఆన్‌లైన్‌లో విక్రయించనున్నాం. స్థానిక పంచాయతీ అభివృద్ధికి మాత్రమే కేటాయిస్తా'మని ఎమ్మెల్యే గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవర ప్రసాదరావు, అగతముడి అరుణ్, అగతముడి మాధవరావు, మాతల గాంధీ, గెడ్డవలస కమలాకర్, సన్యాసినాయుడు, ఎద్దు దాసునాయుడు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'మీ కోసం'లో 235 అర్జీల స్వీకరణ

- సమస్యలకు సమగ్ర పరిష్కారం చూపాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్ జూలై 8: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'మీ కోసం'లో వచ్చిన అర్జీలకు సమగ్ర పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో వివిధ సమస్యలపై 235 అర్జీలను స్వీకరించారు. ఆ అర్జీలను పరిశీలించి.. వాటి పరిష్కారానికి సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలో వివిధ పత్రికల్లో ప్రచురితమైన వార్తలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రతికూల వార్త అందిన 24 గంటల్లో సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో జేసీ నవీన్, ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శన దొర, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, డీసీహెచ్ఎస్ డా.రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ రాంబాబు, ఉద్యానశాఖ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నియంత్రణకు కమిటీ

ప్రతీ కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా ప్రతీ పది మంది ఉద్యోగులు ఉన్న కార్యాలయంలో కమిటీని ఏర్పాటు చేసి.. సంబంధిత వివరాలు ఐసీడీఎస్ కార్యాలయానికి పంపాలని తెలిపారు. సచివాలయాల్లోను ఈ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాస్థాయిలో ఒక కమిటీ(ఎల్‌సిసి) పని చేస్తుందని, పదిమంది కంటే తక్కువ సిబ్బంది పని చేసే సంస్థలు, కార్యాలయాల ఉద్యోగులు ఈ కమిటీని సంప్రదించవచ్చని సూచించారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పూరీ రథయాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అరసవల్లి, జూలై 8: ప్రపంచంలోనే అత్యంత ప్రాధాన్యం, విశిష్టత కలిగిన పూరీ జగన్నాథస్వామి రథయాత్రకు శ్రీకాకుళం నుంచి ప్రత్యేక లగ్జరీ బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. 'ఈ నెల 13న శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరే ఈ ప్రత్యేక బస్సు 14న ఉదయం 5 గంటలకు పూరీ చేరుకుంటుంది. జగన్నాథుని దర్శనం అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి కోణార్కు సూర్య దేవాలయం సందర్శన ఉంటుంది. అనంతరం సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది. యాత్రకు సంబంధించి ఒక్కరికి టిక్కెట్ ధర రూ.2200గా నిర్ణయించాం. ఆన్‌లైన్ ద్వారా కూడా టిక్కెట్లు బుక్ చేసుకోచ్చు' అని విజయకుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 73829 21647, 99592 25608, 99592 25609, 73829 17289 నెంబర్లలలో సంప్రదించాలని సూచించారు.

నౌపడా నుంచి ప్రత్యేక రైళ్లు

టెక్కలి: జగన్నాథుని రథయాత్ర పురస్కరించుకొని ఈనెల 15, 16, 17 తేదీల్లో నౌపడా రైల్వేస్టేషన్ నుంచి పూరీకి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 'ఈ రైళ్లు ఉదయం 4 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.05 గంటలకు పూరీకి చేరుకుంటాయి. అలాగే 15, 17 తేదీల్లో రాత్రి 11గంటలకు పూరీలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.40 గంటలకు నౌపడాకు చేరుకుంటాయి. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాల'ని అధికారులు కోరారు.



హిరమండలం వద్ద గొట్టాబ్యారేజీ సమీపంలో వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలకు సాక్ష్యం ఈ చిత్రం. ఇక్కడ రెండు రోజులుగా అర్ధరాత్రి వేళ యంత్రాలతో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా చేపడుతున్నారు. దీంతో పది అడుగులకుపైగా గోతులు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో భూగర్భ జలాల పరిరక్షణకు, గొట్టాబ్యారేజి రక్షణకు ఇసుక తవ్వకాలపై నిషేధం విధించినా.. అక్రమ రవాణా సాగుతోంది. అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.


పగలు నది ఒడ్డున ఉంచిన ఎక్స్‌కవేటర్

తవ్వేసి.. తరలించేసి..

- రెచ్చిపోతున్న కొందరు తెలుగు తమ్ముళ్లు
- వంశధారలో యథేచ్ఛగా తవ్వకాలు
- రాత్రివేళ లారీల్లో అక్రమ రవాణా

(హిరమండలం)


హిరమండలం వద్ద వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గత రెండు రోజులుగా అర్ధరాత్రి యంత్రాలతో ఇసుక తవ్వేస్తున్నారు. ఆపై అక్రమంగా లారీలకు తరలించేస్తున్నారు. మేజర్ పంచాయతీకి చెందిన కొంతమంది టీడీపీ నాయకుల కనుసన్నల్లో ఈ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వంశధార రిజర్వాయర్ కాంట్రాక్టర్ అప్పట్లో నదిలో మట్టి రహదారి ఏర్పాటు చేశారు. ఆ రహదారిని అక్రమార్కులు బాగుచేసి.. లారీల రాకపోకలుగా వీలుగా మార్చుకున్నారు. రోజుకు 30 లారీలకుపైగా ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రెండు రోజులుగా తరలించిన ఇసుక విలువ రూ.30లక్షలకుపైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అధికారపార్టీ నేతల అండతో ఇసుకను తరలిస్తుండంతో.. గనులు, సెబ్, పోలీసు, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

● రిజర్వాయర్ పనుల కోసం

హిరమండలం వద్ద వంశధార రిజర్వాయర్ పనుల కోసం కొన్ని నెలల కిందట తహసీల్దారు కార్యాలయం సమీపంలోని నదిలో ఇసుక తరలించేందుకు ఉన్నతాధికారులు అనుమతిచ్చారు. సంబంధిత కాంట్రాక్టర్ రిజర్వాయర్ పనులకు అవసరమైన మేరకు ఇసుకను తరలించారు. ఇంకా మిగిలి ఉన్న పనులకు కూడా ఈ ప్రాంతంలోని ఇసుకనే ఉపయోగించాల్సి ఉంది. ప్రభుత్వ అనుమతులతో ఈ ప్రాంతం నుంచి రిజర్వాయర్ పనులకు ఇసుకను తరలి స్తున్న సమయంలో స్థానిక అధికారులు అడ్డుకునేవారు. దీంతో కాంట్రాక్టరు ఇబ్బందులు పడేవారు. అయితే ఇప్పుడు అక్రమంగా ఇసుక తరలిస్తున్నప్పటికీ ఎందుకు పోలీసులు, రెవెన్యూ అధికా రులు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలకు అడు కట్ట వేయాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సుధాకర్ వద్ద ప్రస్తావించగా.. నదిలో తవ్వకాలు పరిశీలించి, అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఇసుకను తరలించేందుకు నదిలో ఏర్పాటు చేసిన రహదారి

అంగన్‌వాడీలకు అద్దె కష్టాలు



మెళియాపుట్టి మండలం పెంగువాడ గిరిజన అంగన్‌వాడీ కేంద్రంలో 12 మంది చిన్నారులు ఉన్నారు. వీరితో పాటు బాలింతలు, గర్భిణులు మరో 15 మంది ఉన్నారు. ఇరుకైన అద్దె ఇంట్లో కేంద్రం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతినెలా సక్రమంగా అద్దె బిల్లు చెల్లించకపోవటంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత డబ్బులు వెచ్చించి అద్దె చెల్లిస్తున్నారు.

మెళియాపుట్టి మండలం రట్టిణి గ్రామంలో కూడా అంగన్‌వాడీ కేంద్రం అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 15 మంది చిన్నారులు ఉన్నారు. ఏడాది నుంచి అద్దె బిల్లులు రాకపోవడంతో.. అంగన్‌వాడీ సిబ్బంది సొంత డబ్బులు చెల్లిస్తున్నారు.

- బిల్లులు చెల్లింపులో గత ప్రభుత్వ నిర్లక్ష్యం
- పేరుకుపోయిన బకాయిలు
- నిర్వాహకులపైనే భారం

(మెళియాపుట్టి)

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులకు అద్దె కష్టాలు వెంటాడుతున్నాయి. జిల్లాలోని చాలా కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె పెంచుతున్నట్టు ఆదేశాలు జారీ చేసినా.. అమలుకాలేదు. సక్రమంగా అద్దె బిల్లులు మంజూరు చేయకపోవడంతో.. ఇంటి యాజమానుల ఒత్తిడి భరించలేక నిర్వాహకులు సొంత డబ్బులు చెల్లిస్తున్నారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా సకాలంలో అద్దె బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

జిల్లాలో 3,358 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 946 కేంద్రాలు మాత్రమే సొంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. 1,335 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మరో 1,077 కేంద్రాలు.. పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. గతేడాది డిసెంబరు నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె పెంచుతున్నట్టు అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. పట్టణ ప్రాంతాల్లో రూ.4వేల నుంచి రూ.6వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు పెంచుతున్నట్టు వెల్లడించింది. అలాగే గిరిజన గ్రామాల్లో రూ.500 నుంచి రూ.వెయ్యికి పెంచుతున్నట్టు పేర్కొంది. కానీ ఇవి ప్రకటనలకే పరిమితమయ్యాయి. అద్దె నిధులు పెంచకపోగా.. సకాలంలో ప్రతినెలా బిల్లులు కూడా చెల్లించకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది నవంబరు వరకు మాత్రమే అద్దె బిల్లులు చెల్లించారు. సుమారు 20 లక్షల మేర అద్దె బకాయిలు పేరుకుపోయాయి. అద్దె బిల్లులు మంజూరు చేయాలని గతంలో అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. అలాగే సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెబాట పట్టినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో నిర్వాహకులు తమ జీతం డబ్బుల నుంచి అద్దెలు, విద్యుత్, గ్యాస్ బిల్లులు చెలిస్తున్నామని వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు. సకాలంలో అద్దె బిల్లులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.



వైసీపీ నాయకుడి వద్ద.. సచివాలయం తాళాలు

- పట్టించుకోని అధికారులు

జి.సిగడాం, జూలై 8: జి.సిగడాం మండలం పెంట గ్రామంలోని సచివాలయంలో స్థానిక వైసీపీ నాయకుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి సచివాలయ తాళాలు.. అధికారులు, లేదా సిబ్బంది వద్ద ఉండాలి. కానీ, వైసీపీ నాయకుడి వద్దే సచివాలయ తాళాలు ఉండడంతో.. నిబంధనలకు విరుద్ధంగా అనధికార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైఎస్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఉదయం అధికారులు రాకముందే సచివాలయంలో అనధికారికంగా వేడుకలు నిర్వహించారని పేర్కొంటున్నారు. వైసీపీ నాయకుడి వద్ద ఉన్న సచివాలయ తాళాలు తీసుకోవాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోకుండా మిన్నకుండిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సచివాలయ సిబ్బందిని అడగ్గా.. తాము విధులకు వచ్చేసరికే వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పించినట్టు ఉందని తెలిపారు. ఎంపీడీవో వెంకన్నబాబు వద్ద ప్రస్తావించగా.. వైసీపీ నాయకుడి నుంచి సచివాలయ తాళాలు తీసుకునేలా చర్యలు చేపడతామన్నారు.


పెంట గ్రామ సచివాలయం

క్లాట్ నోటిఫికేషన్

దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

దిక్సూచి
DIKSUCHI

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ(ఎస్‌వీవీయూ)- 'డిప్లొమా ఇన్ యానిమల్ హస్బెండరీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 990 సీట్లు ఉన్నాయి.

శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీలో డిప్లొమా

అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా యూనివర్సిటీ అనుబంధ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల్లో చదివినవారికి నిర్దేశించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు సెమిస్టర్లు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి మూడు సెమిస్టర్లు కోర్సు వర్క్‌లు; చివరి సెమిస్టర్‌లో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ప్రోగ్రామ్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఈ కోర్సు పూర్తిచేసినవారు 'బీవీఎస్సీ&ఏహెచ్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అనర్హులు. బీఎస్సీ(బయాలజీ స్ట్రీమ్) ప్రోగ్రామ్‌లు, బీ ఒకేషనల్(అగ్రికల్చర్/హార్టికల్చర్) ప్రోగ్రామ్‌లు, (బీఏ/బీకాం)(మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులు కాకుండా) ప్రోగ్రామ్‌లలో చేరవచ్చు.

అర్హత: అభ్యర్థులు ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఐసీఎస్ఈ అభ్యర్థులు సైన్స్ మార్కుల కింద ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో వచ్చిన యావరేజ్ మార్కులను; సోషల్ మార్కుల కింద హిస్టరీ, సివిక్స్, జాగ్రఫీ సబ్జెక్టుల్లో వచ్చిన యావరేజ్ మార్కులను ఎంటర్ చేయాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 22
- **వెబ్‌సైట్:** www.svvu.edu.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జాతీయ అత్యవసర పరిస్థితి(1975)

ఒక సమగ్ర అవగాహన

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఎమర్జెన్సీ విధించిన రోజు రాత్రి వార్తాపత్రికల ముద్రణాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉద్యమకారులు, నాయకుల అరెస్టుల సమాచారం వ్యాప్తిచెందకుండా సమాచార సాధనాలపై పలు ఆంక్షలు విధించారు. పత్రికలు తీవ్రంగా సెన్సార్‌షిప్‌నకు గురయ్యాయి. రేడియోలో ప్రభుత్వం ఇచ్చిన వార్తా సమాచారం మాత్రమే ఎప్పటికప్పుడు ప్రసారం అవుతుండేది.

జనాభాను నియంత్రించేందుకు వివాహం కాని పురుషులకు కూడా బలవంతంగా కుటుంబ నియంత్రణ(వ్యాసెక్టమీ) ఆపరేషన్లు నిర్వహించారు. ముఖ్యంగా ప్రతిపక్ష యువ నాయకులను లక్ష్యంగా చేసుకున్నారని ఒక ఆరోపణ. ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్ గాంధీ ఈ కార్యక్రమం అమలుకు పూనుకోవడంతోపాటు పెద్ద ఎత్తున ఇతర అధికార దుర్వినియోగాలకు పాల్పడ్డాడని ఆరోపణలు వచ్చాయి. ప్రజల ప్రాథమిక హక్కులపై సైతం ఆంక్షలు విధించారు.

'ఏడీఎం జబల్‌పూర్ వర్సెస్ శివకాంత్ శుక్లా కేసు(1976)'లో అత్యవసర పరిస్థితి కాలంలో జీవించే హక్కు సహా అన్ని ప్రాథమిక హక్కులపై ప్రభుత్వం దేశ భద్రత దృష్ట్యా పరిమితులు విధించవచ్చని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీనితో ఎమర్జెన్సీ కారణంగా ప్రకరణ 359 ప్రకారం ప్రజలు జీవించే హక్కు సహా ఇతర హక్కులను కోల్పోయినట్లయింది.


అత్యవసర పరిస్థితి కాలంలో తమ చర్యల సానుకూలత కోసం, అధికారాన్ని నిలుపుకోవడానికి ఇందిర ప్రభుత్వం ప్రధానంగా మూడు రాజ్యాంగ సవరణలు చేసింది. అవి 1975లో 38వ, 39వ; 1976లో చేసిన 42వ రాజ్యాంగ సవరణ.

38వ రాజ్యాంగ సవరణ ప్రకారం రాష్ట్రపతి విధించిన అత్యవసర పరిస్థితిని, రాష్ట్రపతి-గవర్నర్లు-లెఫ్టినెంట్ గవర్నర్లు జారీ చేసే ఆర్డినెన్స్‌లను కోర్టుల న్యాయ సమీక్షాధికార పరిధి నుంచి తప్పించారు. 39వ రాజ్యాంగ సవరణను ఇందిరాగాంధీ తన ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును అధిగమించేందుకు చేసిన సవరణగా చెబుతుంటారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు సంబంధించిన అంశాలేవీ న్యాయ సమీక్ష పరిధిలోకి రాకుండా ఉండేలా ఈ సవరణను రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ అధికారాలు, ప్రధాని అధికారాలను మరింతగా పెంచేలా 42వ రాజ్యాంగ సవరణ రూపొందింది. రాష్ట్ర చట్టాలను అధిగమించేందుకు, దేశంలోని ఏ ప్రాంతంలోనైనా కేంద్ర దళాలు మోహరించేందుకు, జాతి విద్రోహ కార్యక్రమాల సందర్భంలో ప్రాథమిక హక్కులను ఆసాంతం నిరాకరించే చట్టాలు అమలు చేసేందుకు, కేంద్ర, రాష్ట్ర శాసన సభల కాలపరిమితిని సైతం పెంచేందుకు ఈ సవరణ వీలు కల్పించింది. ఈ విధంగా ఎమర్జెన్సీ కాలంలో ప్రకరణ 352 నుంచి 360 వరకు గల అత్యవసర అధికారాలు తీవ్ర మార్పులకు గురయ్యాయి. దేశవ్యాప్తంగా చట్టాలు చేసే అధికారం కేంద్రానికే లభించి అధికార కేంద్రీకరణకు కారణమైంది.

ఎమర్జెన్సీ ఎత్తివేత: 1977 జనవరి 18న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మార్చి 16 నుంచి 20 వరకు ఎన్నికలు జరిగిన అనంతరం 1977 మార్చి 21న ఎమర్జెన్సీని ఎత్తివేశారు.

ఎమర్జెన్సీ అత్యవసర పరిస్థితులు

- 1977 సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.



- అత్యవసర పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ అధికారాలు, ప్రాథమిక హక్కుల పరంగా భారీ సవరణలు చేసిన రాజ్యాంగాన్ని తిరిగి సంస్కరించేందుకు జనతా ప్రభుత్వం పూనుకుంది. మరో భారీ సవరణ చేసింది. అదే 1978లో రూపొందించిన 44వ రాజ్యాంగ సవరణ. దీని ప్రకారం అత్యవసర పరిస్థితి విధించిన సందర్భాల్లోనూ రాజ్యాంగ ప్రకరణ 21 ద్వారా వస్తున్న ప్రాథమిక హక్కు అయిన 'జీవించే హక్కు'ను రద్దు పరచరాదు. అదేవిధంగా 'బాహ్య కారణాల వల్ల' అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు మాత్రమే ప్రకరణ 19లోని స్వేచ్ఛలు పరిమితమవుతాయి. 'సాయుధ తిరుగుబాటు' కారణంగా అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు వీటిపై ప్రభావం ఉండదు. అత్యవసర పరిస్థితికి సంబంధించిన చట్టాలు మినహా ఇతర చట్టాల ద్వారా రాజ్యాంగ స్వేచ్ఛలపై పరిమితులు విధించేందుకు వీలు లేదు. హక్కుల రద్దు అంశాలకు సంబంధించిన ప్రకరణలైన 358, 359లను 44వ రాజ్యాంగ సవరణ పరిమితం చేసింది. అంతేకాకుండా రాష్ట్రపతి జారీ చేసిన అత్యవసర పరిస్థితి ప్రకటనను తిరిగి న్యాయ సమీక్షాధికార పరిధిలోకి తీసుకొచ్చారు.
- 'క్యాబినెట్', 'లిఖిత పూర్వక' అనే పదాలను ప్రకరణ 352(3)లో చేర్చి ప్రధాని అధ్యక్షతన గల 'క్యాబినెట్' స్థాయి మంత్రుల 'లిఖిత పూర్వక' సలహా మేరకు మాత్రమే రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తారని సూచిస్తూ జాతీయ అత్యవసర పరిస్థితి విధింపు విధానాన్ని కొంత క్లిష్టం చేశారు.
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన తేదీ నుంచి నెల రోజుల లోపు అత్యవసర పరిస్థితి ప్రకటనను ప్రత్యేక మెజారిటీతో పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఒకవేళ అత్యవసర పరిస్థితి ప్రకటించే సమయానికి లోక్‌సభ రద్దయి ఉంటే తిరిగి కొత్త లోక్‌సభ ఏర్పడిన రోజు నుంచి 30 రోజులలోగా ఆమోదించాల్సి ఉంటుంది. ఈలోగా రాజ్యసభ అత్యవసర పరిస్థితి ప్రకటనను ఆమోదించాలి. లేనిచో 30 రోజుల తరవాత అత్యవసర పరిస్థితి తనంతతానుగా రద్దయిపోతుంది.
- ఒకసారి పార్లమెంట్ ఆమోదం పొందితే అత్యవసర పరిస్థితి ఆరు నెలల వరకు అమలులో ఉంటుంది. ఈవిధంగా ఆర్నెల్లకోసారి పార్లమెంట్ ప్రత్యేక మెజారిటీతో ఆమోదించి అత్యవసర పరిస్థితిని ఎన్ని పర్యాయాలైనా పొడిగించవచ్చని సవరణ చేశారు.
- 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 352లోని 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో 'సాయుధ తిరుగుబాటు'అనే పదాన్ని చేర్చారు. కనుక జాతీయ అత్యవసర పరిస్థితిని(ప్రకరణ 352) విధించాలంటే విదేశీ దాడి, యుద్ధం వంటి బాహ్య కారణాలు; సాయుధ తిరుగుబాటు వంటి అంతర్గత కారణాల రీత్యా మాత్రమే వీలవుతుంది. అదేవిధంగా 44వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ అత్యవసర పరిస్థితి రద్దుకు సంబంధించిన తీర్మానాన్ని కేవలం సాధారణ మెజారిటీతో ఆమోదించినా సరిపోతుంది అని అత్యవసర పరిస్థితి రద్దును సరళతరం చేశారు. లోక్‌సభ సమావేశంలో లేకుంటే లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో 1/10వ వంతు మంది సభ్యులు లోక్‌సభ ప్రత్యేక సమావేశం కోసం స్పీకర్ లేదా రాష్ట్రపతికి నోటీసు పంపినపుడు 14 రోజుల్లోపు రాష్ట్రపతి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంటుందని 44వ రాజ్యాంగ సవరణ నిర్ధారించింది.
- 1975 నుంచి 77 మధ్య కాలంలో కొనసాగిన జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో సంభవించిన అధికార దుర్వినియోగం, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన వంటి అనేక ఆరోపణలపై నిజ నిర్ధారణకు జనతా ప్రభుత్వం 1977లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జయంతి లాల్ ఛోటా లాల్‌షా నేతృత్వంలో 'షా కమిషన్'ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 1978లో సమర్పించిన నివేదికలో పేర్కొన్న సంఘటనలపై విచారణ జరిపేందుకు జనతా ప్రభుత్వం ప్రత్యేక కోర్టులను కూడా ఏర్పాటు చేసింది. జనతా ప్రభుత్వం 1979లో కూలిపోయింది. 1980లో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ ప్రభుత్వం 'షా కమిషన్' నివేదికను ఉపసంహరించింది. సుప్రీంకోర్టు కూడా ప్రత్యేక కోర్టులు చెల్లవని తీర్పు చెప్పడంతో ఈ అంకానికి తెరపడింది.
- ఎమర్జెన్సీ కాలం నాటి పరిస్థితులు, ఇందిరాగాంధీ అవలంభించిన నిరంకుశ ధోరణి మాత్రం భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఎప్పటికీ ఒక మాయని మచ్చగానే మిగిలిపోయింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/bhtSZSEలో చదవండి.

కమల్‌హాసన్ 'సేనాపతి'గా నటించిన చిత్రం 'భారతీయుడు2'. 1996లో తెరకెక్కిన 'భారతీయుడు'కు సీక్వెల్‌గా శంకర్ దర్శకత్వం వహించగా, సుభాస్కరన్ నిర్మించారు. సిద్ధార్థ్, బాబీసింహా, ఎస్.జే.సూర్య, రకుల్ ప్రీత్‌సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 12న 'భారతీయుడు 2' విడుదలవుతున్న సందర్భంగా సోమవారం చిత్రబృందం మీడియాతో సమావేశమై చిత్ర విశేషాలను పంచుకున్నారు.



తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ను చేశారు

కమల్‌హాసన్

కమల్ హాసన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ను చేసి ఈ స్థాయికి తెచ్చారు. ఈ సినిమాలో 'సేనాపతి' క్యారెక్టర్ చెప్పే డైలాగ్స్ సమాజంలో నుంచి పుట్టినవాటిలా ఉంటాయి. శంకర్ విజన్‌ను, మేకింగ్‌ను థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు. రెండు వేళ్లు మడత పెట్టడం అంటే.. ఒకటి ఓటు వేసేది. రెండోది మన బాధ్యతది చెప్పేది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ 'భారతీయుడు' టైమ్‌లో సీక్వెల్ తీస్తానని అస్సలు అనుకోలేదు. ఆ మూవీ తరువాత ఇన్నేళ్లలో ఎక్కడ లంచం తీసుకున్నారనే వార్తలు చదివినా నాకు'సేనాపతి గుర్తుకు వచ్చేవారు. కానీ కథ కుదరక ఆగిపోయేవాడ్ని. సినిమాలో నేను రాసిన ప్రతీ సన్నివేశాన్ని కమల్‌హాసన్ తన నటనతో పదిరెట్లు పెంచారు' అని చెప్పారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ 'భారతీయుడు 2' సినిమా సమాజంలో జరిగే అవినీతికి ఓ అప్‌డేటెడ్ యాంటీ వైరస్ లాంటిది. శంకర్ దర్శకత్వం వహించిన 'బాయ్స్'తోనే కెరీర్‌ను ఆరంభించాను. మళ్లీ 20 ఏళ్ల తరువాత ఇందులో నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది. యువత సమాజం కోసం ఏం చేయాలో చెప్పే చిత్రమిది' అని చెప్పారు. నిర్మాత సురేశ్‌బాబు మాట్లాడుతూ 'కమల్ హాసన్ ఇండియన్ సినిమా హద్దుల్ని చెరిపేస్తూ ముందుకు సాగుతుంటారు. డైరెక్టర్ శంకర్ సోషల్ మెసేజ్‌తో పాటు ఎంటర్టైన్‌మెంట్ జోడించి సినిమా తీసే విధానం అద్భుతం' అని అన్నారు. బాబీసింహా మాట్లాడుతూ 'భారతీయుడు' చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ 28 ఏళ్ల తర్వాత 'భారతీయుడు 2'గా 'సేనాపతి' వస్తున్నాడు. ఈ చిత్రం మొదటి పార్ట్ కంటే పదింతలు హిట్ అవుతుంది' అని అన్నారు. రకుల్ ప్రీత్ మాట్లాడుతూ 'భారతీయుడు' సినిమా సీక్వెల్‌లో నేను నటిస్తానని కలలో కూడా అనుకోలేదు' అని చెప్పారు.

విజయ్ సినిమా మైత్రీ చేతుల్లో..



తమిళ అగ్రకథానాయకుడు విజయ్, దర్శకుడు వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. ఈ సినిమాలో విజయ్ సరసన మీనాక్షి చౌదరి నటిస్తోంది. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో అందరి దృష్టినీ ఆకర్షించిన ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ విడుదల చేయనుంది. ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్ జయరామ్, స్నేహ, లైలా ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కల్పాతి ఎస్ అఘోరం, కల్పాతి ఎస్. గణేశ్, కల్పాతి ఎస్.సురేశ్ నిర్మిస్తున్నారు.

వరుణ్‌తేజ్ విజృంభణ



వరుణ్‌తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రానికి కరుణకుమార్ దర్శకుడు. మీనాక్షి చౌదరి హీరోయిన్. బాలీవుడ్ నటి నోరా ఫతేహి కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్మించిన ఓ భారీ సెట్‌లో ప్రస్తుతం యాక్షన్ పార్ట్ చిత్రీకరణ జరుగుతోంది. సినిమాలో చాలా కీలకమైన ఓ ఫైట్‌ను విజయ్ మాస్టర్ సారథ్యంలో చిత్రీకరిస్తున్నారు. వరుణ్‌తేజ్ చాలా రిస్క్ తీసుకుని ఈ ఫైట్ చిత్రీకరణలో పాల్గొంటున్నారు. యాక్షన్ పార్ట్‌లో అతని విజృంభణను అదిరిపోయే లెవల్‌లో ఉంటుందని నిర్మాతలు చెప్పారు. అలాగే ఇంతవరకూ పోషించని ఓ విభిన్న పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించి ఆడియన్స్‌ను అలరించనున్నారు. అతని కెరీర్‌లో ఇదొక మైలు రాయిగా నిలుస్తుందని దర్శకుడు కరుణకుమార్ చెబుతున్నారు. వింటేజ్ వైజాగ్‌ను ఈ సినిమాలో చూడవచ్చని అంటున్నారు. టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు.

సిద్ధమవుతున్న షణ్ముఖ



మంచి కథాంశం ఎన్నుకుని ఆసక్తి కలిగించే నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. 'శాసన సభ' చిత్రాన్ని అందించిన సొప్పని బ్రదర్స్ నిర్మిస్తున్న రెండో చిత్రం ఇది. షణ్ముగం సొప్పని దర్శకుడు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఆది సాయికుమార్ గెటప్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌ను ఆది వెనుక షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి కనిపిస్తుండడం ఆసక్తిగా మారింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా తెరకు ఎక్కిస్తున్నాం. అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేస్తాం' అని చెప్పారు. తులసీరామ్ సొప్పని, షణ్ముగం సొప్పని, రమేశ్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

లక్కీ భాస్కర్ వచ్చేది ఎప్పుడంటే?



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తెలుగులో నటిస్తున్న తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. 1980-90 ల కాలంలో అసాధారణ స్థాయికి చేరుకున్న ఓ సాధారణ బ్యాంక్ క్యాషియర్ ప్రయాణాన్ని చూపించే సినిమా ఇది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 7న విడుదల కానుంది. చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ విషయాన్ని ప్రకటించింది. 'లక్కీ భాస్కర్' చిత్రం కోసం ఆర్ట్ డైరెక్టర్ బంగ్లాన్ 80ల నాటి ముంబై నగరాన్ని హైదరాబాద్‌లో భారీ సెట్స్‌తో పునర్నిర్మించారు. అలాగే ఆ కాలం నాటి బ్యాంకులను పోలి ఉండే భారీ బ్యాంక్ సెట్‌ను కూడా రూపొందించారు మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

సస్పెన్షన్ తొలగిస్తారని ఆశిస్తున్నా



బెంగుళూరు రేవ్ పార్టీ కేసులో నటి హేమ అరెస్టయిన సంగతి తెలిసిందే. దీంతో 'మా' అసోసియేషన్ నుంచి ఆమెను సస్పెండ్ చేశారు. తాజాగా, నటి హేమ ఓ లేఖ రాసి, 'మా' అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు అందజేశారు. అందులో "నేను దశాబ్ద కాలం పైగా 'మా'లో సభ్యురాలిగా ఉన్నాను. 'మా' నాకు అమ్మలాంటిది. డ్రగ్స్ కేసులో నాపై అనేక ఆరోపణలు రావడంతో నా అంతట నేనే డ్రగ్స్ శాంపిల్ టెస్ట్ చేయించుకున్నాను. అందులో నాకు నెగెటివ్ వచ్చింది. త్వరలోనే పోలీసులు చేసిన టెస్ట్‌లోనూ ఇదే ఫలితం వస్తుందనే నమ్మకం ఉంది. డ్రగ్స్ కేసులో నాపై జరిగిన దుష్ప్రచారంతో నేను ఎంతో మానసిక క్షోభకు లోనయ్యాను. నా విషయంలో 'మా' సభ్యులు అండగా ఉండాలని కోరుకుంటున్నాను. నాపై సస్పెన్షన్ తొలగిస్తారని ఆశిస్తున్నా" అని లేఖలో పేర్కొన్నారు. అలాగే త్వరలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అపాయింట్‌మెంట్‌ను తీసుకొని తనకు న్యాయం చేయాలని హేమ కోరనున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sHzh5PV లో చదవండి.


మత్స్య, కూర్మావతారాల్లో జగన్నాథుడు

జగన్నాథ రథయాత్ర సందర్భంగా రెండోరోజు సోమవారం జిల్లాలో పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో జగన్నాథ స్వామి వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. మత్స్య, కూర్మావతారాల్లో దర్శనమిచ్చి ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. -ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళం కల్చరల్: మొండేటి వారి వీధిలో మత్స్యావతారంలో జగన్నాథుడు







సోంపేట: మత్స్య, ఎల్ఎన్‌పేట: కూర్మావతారంలో..



హిరమండలం: మత్స్య, కూర్మావతారాల్లో..




జలుమూరులో మత్స్య, అవలింగిలో కూర్మావతారంలో దర్శనమిచ్చిన స్వామి

నరసన్నపేట, టెక్కలిలో మత్స్యావతారంలో స్వామి

మహిళా కండక్టర్ నిజాయితీ

టెక్కలి: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు బంగారు గొలుసు పోగొట్టుకోగా గమనించిన కండక్టర్ ఆమెకు ఆ ఆభరణాన్ని అందించి తన నిజాయితీని నిరూపించుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. సోమవారం మధ్యాహ్నం 3 గంటల ట్రిప్పులో టెక్కలి-పాతపట్నం రూట్‌లో వెళుతున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న పొట్నూరు రాణి రెండు తులాల గొలుసును పోగొట్టుకుంది. కండక్టర్ టిక్కెట్లు ఇస్తున్న సమయంలో తెంబూరు దాటిన తరువాత ఆ గొలుసు కండక్టర్‌కు దొరికింది. అయితే అప్పటికే తెంబూరులో దిగిపోయిన రాణి ఇంటికి వెళ్లి తన మెడలో గొలుసు లేకపోవడంతో ఆందోళన చెంది కుటుంబ సభ్యులకు తెలిపింది. వారు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. బస్సు పాతపట్నంలో ఉండడంతో బస్సులో వెతకడం ప్రారంభించింది. దీనిపై వివరాలు ఆరా తీసిన కండక్టర్ గొలుసు తనకు దొరికిందని చెప్పడంతో రాణి ఊపిరిపీల్చుకుంది. పూర్తి వివరాలు సేకరించి కండకర్టర్ ఆ గొలుసుకు ఆమెకు అందజేసింది. వెంటనే ప్రయాణికులు కండక్టర్ విజయకుమారిని అభినందించారు.



రాణికి గొలుసును అందజేస్తున్న కండక్టర్ విజయకుమారి

బ్రాహ్మణులను దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

నరసన్నపేట: బ్రాహ్మణులను సామాజిక మాధ్యమాల్లో పరుష పదజాలంతో విమర్శించిన పార్వతీపురం మన్యం జిల్లా శివిని గ్రామానికి చెందిన పైల దాస్‌పై చర్యలు తీసుకోవాలని మారుతీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నరసన్నపేట ఎస్ఐ అశోక్ బాబుకు సత్యవరాగ్రహారం రుత్వికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. బ్రాహ్మణులను, పండితులను, పురోహితుల మనో భావాలను దెబ్బతీసేలా సదరు వ్యక్తి మాటలు ఉన్నాయన్నారు. చట్టరీత్యా చర్యలు తీసుకుని ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘ నాయకులు జోస్యుల సోమేశ్‌శర్మ, ఎం.జగదీష్‌బాబు, జగన్నాథశర్మ, దేవి ప్రసాద్, వి.రామచంద్రశర్మఉన్నారు.



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న సంఘ నేతలు

సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

మెళియాపుట్టి: సాగునీటి కాలువలను బాగు చేసి సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో జి.భాస్కరరావు అన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'పనులు ఒకచోట.. ఫొటో మరో చోట' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించి సోమవారం చాపర, మెళియాపుట్టిల్లోని పంట కాలువలను పరిశీలించారు. రైతులకు ఉపయోగం ఉన్న దగ్గర పనులు చేయాలని సూచించారు. చాపరలో ఐదు కాలువల ఒక క్లస్టర్‌గా చేసి పనులు మంజూరు చేయడం వల్ల ఫొటోలు క్లస్టర్ వద్ద తీస్తేనే వేతనదారులకు డబ్బులు పడతాయన్నారు. ఆయనతో పాటు ఏపీవో రవి ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పంట కాలువను పరిశీలిస్తున్న ఎంపీడీవో భాస్కరరావు

ఉత్తరాంధ్ర యాదవులను బీసీ-బీలో చేర్పించండి

కాశీబుగ్గ: గొర్రెలు, మేకల పశుపోషణ వృత్తిగా జీవిస్తున్న ఉత్తరాంధ్ర యాదవులు విద్య, ఉద్యోగ రంగాల్లో వెనకబడి ఉన్నందున బీసీ-డీ నుంచి బీసీ-బీలోకి చేర్చేలా కృషి చేయాలని ఆ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం విశాఖపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించారు. జనాభా దమాషా ప్రకారం రాజ్యాంగ పదవుల్లో యాదవులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా పల్లాను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ యాదవ నాయకులు నర్తు పురుషోత్తం, ఇప్పిలి జగదీష్, దాసరి తాతారావు, సాలిన మాదవరావు, పత్రి లక్ష్మణరావు, బంగారి శివయాదవ్, వెంకటరావు, జగదీష్ పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న యాదవ సంఘ నాయకులు


భవన నిర్మాణ రంగానికి ఊపిరి

హిరమండలం: వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో నిర్మాణ రంగం ఒడిదుడుకులకు లోనైందని, ఇసుక లభ్యం కాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే ఉచిత ఇసుక విధానం అమలుకు శ్రీకారం చుట్టడంతో సోవవారం హిరమండలం బ్యారేజి సెంటర్‌లో భవననిర్మాణ కార్మికులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ రంగానికి ఊపిరి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా కార్మికులు హర్షం వ్యక్తంచేశారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

అవుట్‌లుక్ ఐకార్ ర్యాంకింగ్‌లో ప్రథమస్థానం హర్షణీయం



ఒడిశా

పర్లాకిమిడి: ఒడిశాలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ ఎంఎస్‌స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు అవుట్‌లుక్ ఐకార్ ర్యాంకింగ్-2024లో ప్రథమస్థానం లభించడం గర్వకారణంగా ఉందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సుప్రియ పట్నాయక్ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్ ఫ్యాకల్టీ క్వాలిటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రీసెర్చ్ అవుట్‌పుట్‌లను పరిశీలించి ఈ ర్యాంక్‌ను అందించారన్నారు. అకడమిక్ ఎక్సలెన్స్, వ్యవసాయ విద్యపై అంకితభావం, ఆకట్టుకునే ప్రదర్శనతో డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అద్భుతమైన మైలురాయిని సాధించిందన్నారు. అవుట్‌లుక్ ఐకార్ ర్యాంకింగ్‌లో ఎంఎస్‌స్వామి నాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ నెంబర్‌వన్ స్థానం సాధించడంపై వర్సిటీ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు హర్షం వ్యక్తంచేశారు. భారతదేశంలోనే అత్యుత్తమ విద్యనందించే యూనివర్శిటీల్లో సెంచూరియన్ యూనివర్శిటీ ఒకటిగా నిలవడం ఆనందం కలిగించిందన్నారు.

ఆక్సిజన్ ప్లాంట్ మూలనపడడంపై ఎమ్మెల్యే అసంతృప్తి

● భవనాల నిర్మాణంలో జాప్యంపైనా..

నరసన్నపేట: సామాజిక ఆసుపత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్ మూలకు చేరడంపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అసంతృప్తి వ్యక్తంచేశారు. సోమవారం ఆయన సామాజిక ఆసుపత్రి భవనాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్ లేని సమయంలో ఆసుపత్రిలో రోగులు పడే ఇబ్బందులు గత పాలకులకు కనిపించకపోవడం దారుణమన్నారు. జనరేటర్‌ను బాగు చేసేందుకు వెంటనే అంచనాలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. ఆసుపత్రిలో అదనపు భవనాల నిర్మాణానికి మంజూరైన నిధులను మళ్లించి పనులు మధ్యలో నిలిపివేయడంపై ఆయన విస్మయం చెందారు. 2020లో ఆసుపత్రి నిర్మాణాలు ప్రారంభించినా గత పాలకులు నాబార్డు నిధులు మళ్లించడంతో భవన నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని, పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయని ఈఈ సత్యప్రభాకర్ అన్నారు. సుమారు రూ.4 కోట్లు బకాయిలున్నా యన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి వచ్చే నిధులు ఖర్చు చేయకుండా ఎలా నిర్వహణ చేశారని వైద్యులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆసుపత్రిలో సేవలు విస్తృతం చేసి రోగులకు నమ్మకం కలిగించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీఎస్ డీఈఈ శిమ్మన్న, ఏఈ వెంకటేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ జయశ్రీ, డా.పాగోటి శంకరరావు ఏవో రమణమూర్తి పాల్గొన్నారు.



ఆసుపత్రి భవనాలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

గ్రామదేవతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మబగాం(పోలాకి): మబగాం చిన్నమ్మతల్లి గ్రామ దేవతను సోమవారం ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి వేప చెట్టుకు ముర్రాటలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ నేతలు కాయ రవి, కల్పన తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలతో ప్రమాదాలు

● జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజాచక్రవర్తి

టెక్కలి: యువతీ, యువకులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం ద్వారానే ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలను తప్పక పాటించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదాలకు కారణం కావద్దని హెచ్చరించారు. అనంతరం వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, ఎంపీఐ డి.సంజీవరావు, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి

సోషల్ వెల్ఫేర్ హాస్టల్ కమాటీ సస్పెన్షన్

టెక్కలి: టెక్కలి డిగ్రీ కళాశాల సమీపంలో సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో కమాటీగా పని చేస్తున్న దివ్వల ఎర్రన్నాయుడును ఆ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి సస్పెండ్ చేశారు. ఎర్రన్నాయుడుపై ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన ఏఎస్‌డబ్ల్యూవో విజయ్‌కుమార్‌తో కలిసి దర్యాప్తు నిర్వహించారు. ఎర్రన్నాయుడు విద్యార్థుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో చేతివాటం ప్రదర్శించినట్లు రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

అమరావతికి విరాళం

కొత్తూరు: మాజీ వైస్ ఎంపీపీ అగతముడి బైరాగినాయుడు, కుమారుడు అరుణ్ అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.25 వేలు విరాళంగా అందించారు. సోమవారం ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే గోవింద రావుకు అందజేశారు. అలాగే టీడీపీ మండల అధ్యక్షుడు మాతల గాంధీ కూడా 1001 నగదును అం దించారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు.

ఎస్సీ వర్గీకరణకు నిరంతర పోరాటం

కాశీబుగ్గ: ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘ నాయకులు అన్నారు. ఎమ్మార్పీఎస్ ఏర్పడి 30 ఏళ్లయిన నేపథ్యంలో సోమవారం అంబేడ్కర్ నగర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఉద్యమం 1994 జూలై 8న ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో మాదిగ సంఘ నాయకులు బి.శివ, పరుశురామ్, వి.గణేష్, సీహెచ్‌సంతు, పి.ధను, కె.చందు పాల్గొన్నారు.

హుద్‌హుద్ ఇళ్ల పరిశీలన

వజ్రపుకొత్తూరు: బెండి కొండవద్ద టీడీపీ హయాంలో నిర్మించిన హుద్‌హుద్ ఇళ్లను మండల టీడీపీ నాయకులు సోమవారం సాయంత్రం పరిశీలిం చారు. సుమారు ఎనిమిదేళ్లుగా వినియోగంలో లేకపోవ డంతో తలుపులు, కిటికీలు పాడైనట్లు గుర్తించారు. ఇళ్ల పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహన రావు, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, పచ్చ ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, శాంతారావు, వసంత రావు పాల్గొన్నారు.

గ్రామాలకు చేరుకుంటున్న వంశ'ధార'

పలాసరూరల్: పలాస మండలానికి వంశధార నీరు టెక్కలిపట్నం, కేశుపురం మీదుగా కేదారిపురా నికి సోమవారం నాటికి చేరింది. అక్కడి నుంచి కంబిరిగాం మీదుగా పలాస సీతమ్మ సాగరం, పలాస- కాశీబుగ్గ ప్రధాన ఆయకట్టు అయిన జగన్నాథ సాగరానికి చేరుకుంది. పూర్తిస్థాయిలో నీరు మంగళ, బుధవారం నాటికి చేరుకునే అవకాశం ఉంది. సోమవారం జనసేన నియోజకవర్గ కన్వీనర్ దుర్గారావు కేశుపురం పియాడిక్ట్ వద్ద వంశ ధార నీటి చేరికను పరిశీలించారు.



జగన్నాథ సాగరానికి చేరిన వంశధార నీరు

ప్రతి రైతుకు ఎరువులు అందేలా చర్యలు

టెక్కలి: ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతుకు ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవ సాయశాఖ ఏడీ బీవీ తిరుమల రావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రైతుభరోసా కేంద్రాలకు డీఏపీ, యూరియాలను అందజేశామని, త్వరలో రైతులకు పంపిణీ చేస్తామన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం 'అన్నదాత సుఖీభవ' పథకం అందుబాటులోకి తీసుకురానుందని, దీనికి సంబంధించి క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏవో జి.రంగారావు, సురేష్, యమున పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయండి

టెక్కలి: పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని యూనిఫారాలు, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాలని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్‌టూ విద్యార్థినులు కోరారు. సోమవారం ఉన్నతవిద్య ఆర్జేడీ సీహెచ్ విజయ్‌భాస్కర్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సమస్యలపై వినతిపత్రం అందించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇంటర్‌లో ప్రవేశాలు పూర్తి స్థాయిలో చేపట్టడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో విలియమ్స్, హెచ్‌ఎం నౌపడా శోభారాణి, కూన వెంకటరమణ పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్

పోలాకి: బీజేపీ ఓబీసీ విభాగం మండల అధ్యక్షుడిగా పోలాకికి చెందిన గేదెల దుర్గారావును నియమించారు. ఈ మేరకు సోమవారం ఆయనకు బీజేపీ, యువమోర్చా, శ్రీశయన సంఘం, ఉమ్మడి కూట మి నాయకులకు అభినందించారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు. దుర్గారావును కూటమి నాయకులు కిల్లి లక్ష్మణరావు, కరుకోల రామారావు అభినందించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన రికార్డులు, విక్రయాల రికార్డులను, స్టాకును పరిశీలించారు. వెంకటేశ్వర ట్రేడర్స్‌లో 1,04,751 విలువ చేసే 1.26 ఎంటిఎస్ ఎరువుల విక్రయాలను నిలుపుదల చేయాలని సూచించారు. సంబంధిత పత్రాలు ఇచ్చిన తరువాతే అమ్మకాలు చేపట్టాలన్నారు. ఈ దాడుల్లో తాడేపల్లిగూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ, విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్, క్వాలిటీ కంట్రోల్ అధికారి మురళీధర్, ఏవో దానకర్ణుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పలాస: మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడా లని పలువురు వాకర్స్ అన్నారు. పలాస నెహ్రూపార్కు ముత్యాలమ్మ కోనేరు గట్టుపై సోమవారం దాతల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే 31 బెంచీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ నేత లు డోకి రామారావు, టీవైరెడ్డి, సుడియా సత్యనారాయణ, సిందిరి బాబూరావు, సొర్ర పద్మావతి, లండ నాగరాజు, రాముపాత్రో, దడియాల నర్సింహులు, బండారు శంకరరావు, సంతోష్‌బెహరా పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న వాకర్స్

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

టెక్కలి: పాతనౌపడా పంచాయతీకి చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ భూ ఆక్రమణలపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు గొరక గణేష్ కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు మాజీ సర్పంచ్ గ్రామంలోని నీలకంఠేశ్వర, రామలింగేశ్వర, రాముల వారి దేవాలయాలకు చెందిన భూముల్లో రోడ్డు వేసి ఆ పక్కనే ఉన్న రియల్ ఎస్టేట్‌లో కలిపి విక్రమాలకు పాల్పడుతున్నాడని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే మరికొందరు గడ్డి కుప్పలు వేసి దేవుని స్థలాలను ఆక్రమిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతు న్నారని ఫిర్యాదు చేశారు. తక్షణం తగు చర్యలు తీసుకుని దేవుని భూములను పరిరక్షించాలని కోరారు.

ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోపాల్



పలాస: ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పలాసకు చెందిన బోనెల గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన రెంటికోట పీహెచ్‌సీలో ఫార్మసీ అధికారిగా పనిచేస్తున్నారు. గ్రీన్ ఆర్మీ వ్యవస్థాపకుడిగా, ఏపీఎన్జీవో పలాస అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. విజయవాడలో జరిగిన ఈ ఎన్నికల్లో గోపాల్‌ను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గోపాల్ ఎన్నికపై సంఘం జిల్లా నాయ కులు సోమేశ్వ రరావు, చక్రవర్తి, సుబ్రహ్మణ్యం, విజయమోహన్ హర్షం వ్యక్తం చేశారు.

సచివాలయాన్ని మరో భవనానికి మార్చండి

పలాస: పట్టణంలోని 17, 18 వార్డులకు సంబంధించి సచివాలయం శిథిలావస్థకు చేరుకుందని, దీనిని మరో భవనంలోకి మార్చాలని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి హనుమంతు మురళీమోహన్, బీజేపీ నాయకులు లక్కోజు ధర్మారావు, మూల కామేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌కు వినతిపత్రం అందించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడం త్వరలో వర్షాలు కురవనుండడంతో ఎప్పుడు కూలిపోతుందోనన్న తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

గ్రామ సమస్యలను పరిష్కరించండి

నందిగాం: పెంటూరు గ్రామ సమస్యలను పరిష్కరించాలని స్థానిక టీడీపీ నాయకులు పి.బాలకృష్ణ, ఎస్.సూర్యారావు, జె.శ్రీహరి, ఎం.నానీ తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి అభి నందించారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనం, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌ను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

రాజాం ఎమ్మెల్యే 'కోండ్రు'ను కలిసిన దళిత మహాసభ నేతలు

నందిగాం: మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను జిల్లా దళిత మహాసభ జిల్లా అధ్యక్ష, ఆర్గనైజింగ్ కార్యదర్శులు బోకర నారాయణరావు, చింతాడ శ్రీనివాసరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. వారు మాట్లాడుతూ ప్రజల మన్ననలు పొంది ఎమ్మెల్యేగా ఎన్నికైన మురళీ మోహన్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని సీఎం చంద్రబాబునాయుడుకు వారు విజ్ఞప్తి చేశారు.



కోండ్రును అభినందిస్తున్న నేతలు

రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలి

మందస: రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మందసలో సోమవారం స్త్రీనిధి సభ్యులతో సమావేశం నిర్వహించారు. వీవో పొదుపులు, చిన్న సంఘాల సభ్యులు గ్రేడింగ్‌ను పెంచుకోవాలని, అంతర్గత అప్పులను ప్రతి సభ్యురాలు తీసుకోవాలని, సీఐఎఫ్, స్త్రీనిధి ద్వారా తీసుకున్న నగదుతో జీవనోపాధిని పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో సీసీలు కిశోర్, గణపతి, వీవోఏ శారదపాల్గొన్నారు.

ఉపాధి పనులతో వలసల నివారణ

సంతబొమ్మాళి: ఉపాధి పనులతో వలసల నివారణ సాధ్యమని తెలుగుయువత జిల్లా నాయకుడు వజ్జ ప్రభాకర్, ఐటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పిన వెంకటేష్ అన్నారు. సోమవారం బోరుభద్రలో ఉపాధి పనులను ప్రారంభించారు. గతంలో సకాలంలో పనులు చేపట్టకపోవడంతో వలసలు జరిగేవ న్నారు. ప్రస్తుతం పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన ఆదేశాలిచ్చా రన్నారు. గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి కొత్త ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా ఉపాధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వల్లభ వసంతరావు, చింతాడ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంత భూములకు సాగునీరు

సంతబొమ్మాళి: 29ఆర్ మేఘవరం కాలువ ద్వారా శివారు ప్రాంతంలోని ప్రతి ఎకరాకు సాగునీరం దిస్తామని మరువాడ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి అన్నారు. సోమవారం మరువాడలో వంశధార కాలువలో పూడికతీత పనులను ప్రారంభించారు. వైసీపీ హయాంలో కాలవల్లోని సిల్ట్ కూడా తొలగించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువలను ఆధునికీకరించేందుకు మంత్రి అచ్చెన్నాయుడు చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా కార్యదర్శి సురాడ దాసురాజు, టీడీపీ మత్స్యకార నాయకుడు సురాడ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాం

పలాస: నియోజకవర్గ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించామని, అయినా ఓటమి చెందామని, దీనిని ఒప్పుకోక తప్పదని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం జీఎంఈ కాలనీలోని తన కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎవరూ అధైర్య పడ వద్దన్నారు. ఇదిలా ఉండగా అప్పలరాజు మాట్లాడుతున్నంతసేపు వేదికపై ఉన్న అందరు పార్టీ నాయకులు సెల్‌ఫోన్‌లో చాటింగ్‌లు చేస్తూ కాలక్షేపం చేయడంపై కార్యకర్తలు గుసగుస లాడుకుంటున్నారు. కిడ్నీ ఆసుపత్రి ఆవరణలోని దివంగత సీఎం రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● **నరసన్నపేట:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మడపాం, నరసన్నపేట, ఉర్లాం గ్రామాల్లో వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● **ఎల్.ఎన్.పేట:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం లక్ష్మీనర్సు పేటలో నిర్వహించారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

డయేరియా సంభవిస్తే ఓఆర్ఎస్ తీసుకోండి

వెదుళ్లవలస(పోలాకి): డయేరియా సోకితే ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ లోప నివారణ మందులు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్య విస్తరణాధికారి నల్లి రవికుమార్ అన్నారు. పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి పద్మప్రియ, మంగం శేఖరబాబు, బరాటం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతు బజారులో కందిపప్పు

● ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: సామాన్యులకు నిత్యావసరాల ధరలు అందుబాటులోకి తేవాలన్న ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా కందిపప్పును స్థానిక రైతుబజారులో సబ్సిడీ ధరకు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక రైతు బజార్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు కందిపప్పు విక్రయ కేంద్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.200 కందిపప్పును రూ.160లకే అందజేస్తున్నామన్నారు. జేసీ నవీన్ కూడా రైతు బజారులో కందిపప్పు విక్రయాలను పర్యవేక్షించారు. అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పెద్దరెల్లి వీధిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.


సబ్సిడీపై కందిపప్పు విక్రయాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రోడ్డు విస్తరణ బాధితులకు అండగా

శ్రీకాకుళం - ఆమదాలవలస రోడ్డు విస్తరణ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విస్తరణకు సంబంధించి నగర పరిధిలోని బాధితులతో బలగ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గొండు శంకర్ అధికారులతో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భూములు, స్థలాలు కోల్పోయిన వారికి బాండ్ల రూపంలో నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, సుడా, ఆర్ అండ్ బి, నగరపాలక సంస్థ అధికారులు, పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణానికి టెండర్లు ఖరారు

కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం పనులను నిర్లక్ష్యం చేసి పక్కన పెట్టిందని విమర్శించారు. స్టేడియం దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో నిర్మాణ పనులకు రీటెండర్లు పిలవడం, అవి ఖరారు కావడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

● కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు వినతి

కంచిలి: మండలంలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని టీడీపీ నాయకులు మాదిన రామారావు, మర్రిపాటి పూర్ణ, టీవీ రమణ, కామేష్, పిలక చినబాబురెడ్డి, పూర్ణ, మద్దిల ఆనంద్, భాస్కరరావు, దుర్గాశీను, అభిమన్యు కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అంపురం జంక్షన్ మీదుగా ఎంఎస్ పల్లి తదితర 20 గిరిజన గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ నిర్మించాలని, కంచిలి రైలు నిలయంలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలని తదితర సమస్యలు వివరించారు. కాగా డీఎస్సీ-98 ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని ఏపీటీఎఫ్ నాయకులు బుడ్డేపు కామేష్‌రెడ్డి వినతిపత్రం అందించారు.


రామ్మోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న కంచిలి మండల నాయకులు


కేంద్రమంత్రితో కలెక్టర్ పుండ్కర్

కేంద్రమంత్రిని కలిసిన కలెక్టర్

అరసవల్లి: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

బాధితులకు న్యాయం చేయండి

శ్రీకాకుళం క్రైం: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (మీ కోసం) ద్వారా స్వీకరించిన అర్జీలకు ప్రాధాన్యం ఇచ్చి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఎస్పీ రాధిక బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 37 అర్జీలు రాగా, వాటిలో చీటింగ్‌పై ఎనిమిది, కుటుంబ తగాదాలపై ఆరు, మిస్సింగ్‌పై ఒకటి, సివిల్ తగాదాలపై ఐదు, ఇతర తగాదాలపై 17 ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై విచారణ చేపట్టి నివేదికను పంపించాలని సంబంధిత స్టేషన్ల ఇన్‌చార్జిలను ఎస్పీ ఆదేశించారు. ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ తదితరులు ఉన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

పింఛన్ల పెంపుపై ఎమ్మెల్యేకి సత్కారం

ఇచ్ఛాపురం: పింఛన్ల మొత్తాలను పెంచడంతో దివ్యాంగులు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను సన్మానించారు. సోమవారం ఇచ్ఛాపురం నుంచి కవిటి మండలంలోని రామయ్యపుట్టుగ వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన్ను కలిశారు. దివ్యాంగులకు రూ.3వేలు నుంచి రూ.6 వేలు, రూ.5 వేలు నుంచి రూ.15వేలు పెంచడంతో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.


సోంపేట: రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్

రమేష్ కుటుంబానికి పరామర్శ

సోంపేట: రామయ్యపట్నం గ్రామానికి చెందిన కోవెల పూజారి రమేష్ పాణిగ్రాహి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం కలిసి పరామర్శించారు. ఆయన వెంట జీకేనాయుడు, సూరాడ చంద్రమోహన్, మద్దు రాజారావు, నిట్టగోపాల్ తెప్పల కోదండరావు తదితరులు ఉన్నారు.

● **కవిటి:** తమ సమస్యలు పరిష్కరించాలని డిజిటల్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు నాలుగు మండలాల డిజిటల్ అసిస్టెంట్లు సోమవారం అభినందించారు.

జగన్ దోపిడీపై విచారణ చేపట్టాలి

అరసవల్లి: అక్రమాల ఘనుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి 540 ఇసుక రీచ్‌ల నుంచి రూ.1.89 లక్షల కోట్లు దోపిడీ చేశారని, ఇది సాక్షాత్తూ గ్రీన్ ట్రిబ్యునల్ చెప్పిందని, తక్షణమే జగన్ దోపిడీలపై విచారణ చేపట్టాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి సెబ్ అనే కొత్త వ్యవస్థను పెట్టి ఎర్ర చందనం, మైన్స్, వైన్స్, ఇసుకను దోపిడీ చేశారని విమర్శించారు. నదీ గర్భంలో ఇసుక లేకుండా చేశారు, దీనివల్ల తుఫాన్లు, వరదలకు మించిన విపత్తు ఏర్పాడుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా తొలిరోజున 88 శాతం పింఛన్లు పంపిణీ చేస్తే.. కూటమి ప్రభుత్వం సచివాలయం ఉద్యోగుల ద్వారా 99 శాతం లబ్ధిదారులకు అందించిందన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

చెరువు ఆక్రమణకు గురి కాకుండా చూడండి

కలెక్టరేట్: బొంతల కోడూరు గ్రామంలో సర్వే నెం.39లో గల చెరువు ఆక్రమణకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టుదారులు, గ్రామస్థులు, సర్పంచ్, ఎంపీటీసీలు కోరారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో జరుగుతున్న మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. బొంతలకోడూరు గ్రామంలో మల్లిపెద్దివాని చెరువును గతంలో కొంతమంది ఆక్రమించగా 2022లో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించారు. ఈ చెరువు కింద సుమారు 70 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు పుష్కలంగా నీరు అందుతుందని అన్నారు. ఇటువంటి సమయంలో మళ్లీ ఆక్రమణలకు ప్రయత్నిస్తున్న వారిని కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

శివారు ఆయకట్టుకు నీరందించాలి

ఎచ్చెర్ల: నారాయణపురం కుడి కాలువ కింద ఉన్న ఎచ్చెర్ల మండల పరిధిలోని శివారు గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జలవనరుల శాఖ డీఈఈ ఎం.మురళీమోహన్ తెలిపారు. ఎచ్చెర్ల మండల కూటమి నేతలతో కలిసి సోమవారం నారాయణపురం ఆనకట్టను, కాలువను పరిశీలించారు. ఈ నెల 18న సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆనకట్ట నుంచి సుమారు 10 కిలో మీటర్ల మేరకు కాలువలో గుర్రపు డెక్కను రూ.2 లక్షలతో అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. కాలువలో గుర్రపు డెక్కను తొలగించి సాగునీరు అందించే చర్యలు తీసు కుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈ జీవీ రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, కూటమి నేతలు పప్పల వెంకటరమణ, నక్క లక్ష్మణరావు, పైడి అన్నంనాయుడు, రుప్ప రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న డీఈఈ, కూటమి నాయకులు

ఎరువుల దుకాణానికి షోకాజ్ నోటీసులు

కంచిలి: కంచిలిలోని భగవాన్ గుప్తా అండ్‌కో దుకాణాన్ని తాడేపల్లిగూడేం వ్యవసాయ సంచాలకులు పలివెల మురళీకృష్ణ, శ్రీకాకుళం విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. అమ్మకాల నిర్వహణలో లోపాలు గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రూ.29,62,545 విలువ చేసే 13.5టన్నుల ఎరువులను, రూ.7,35,000 విలువ చేసే 2250లీటర్ల పురుగు మందులను తక్షణమే అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. ఎరువులు, పురుగు మందులు రైతులకు అమ్మకాలు జరిపే విధానంలో లోపాలన్నీ వెంటనే సవరించాలని స్థానిక వ్యవసాయాధికారులకు కోరారు. దీని పర్యవేక్షణ బాధ్యత సోంపేట ఏడీఏ తీసుకోవాని తెలిపారు. తనిఖీల్లో సోంపేట ఏడిఏ జగన్మోహన్‌రావు, ఏవో బి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ పని కల్పించాలి

అరసవల్లి: ఉపాధి పనులు నిలుపుదల చేయొద్దని, అడిగిన వారందరికీ పని కల్పించాలని, ఎనిమిది వారాలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు జడ్పీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం, ఉపాధ్యక్షురాలు ఈశ్వరమ్మ, నాయకులు దాసరి లక్ష్మీ, నారాయణ, రాజేశ్వరి, గురయ్య, ఆదిలక్ష్మి, రఘు, కుమారి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

గుజరాతీపేట: హెల్మెట్ వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణ, స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలకు అవగాహన సదస్సు, ప్రయాణికులతో కలుసుకుని హెల్మెట్ వినియోగంపై లాభాలను వివరించారు. తర్వాత జిల్లా కోర్టు నుంచి డే అండ్ నైట్ జంక్షన్ వరకు నినాదాలతో ప్రజలకు చైతన్యం కలిగిస్తూ ర్యాలీతోపాటు వాహనదారులతో హెల్మెట్ వాడకంపై వివరించారు. కార్యక్రమంలో అడ్వేకేట్ జి.ఇందిరా ప్రసాద్, డిపో మేనేజర్ మల్లిఖార్జునరావు, సిఐ అవతారం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

శ్రీకాకుళం అర్బన్: జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీ రింగ్ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ టెక్నికల్ అసిస్టెంట్లు, సైట్ ఇంజనీర్ కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘ ప్రతినిధులు జన సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్‌ను కోరారు. సోమవారం ఆయన్ని కలిసి వినతి పత్రం అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

అమ్మో ఆశ్రమ పాఠశాల

● భయాందోళన చెందుతున్న బాలికలు

● వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దుస్థితి

సరుబుజ్జిలి: వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ 280 మంది గిరిజన బాలికలు చదువుతున్నారు. పాఠశాలల్లో చదువుతూ మలేరియా బారిన పడి బిడ్డిక రిస్మిత ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. మరో నలుగురు మలేరియా వ్యాధితో చికిత్స పొందుతున్నారు. దీంతో బాలికల తల్లిదండ్రులు ఇక్కడ వాతావరణ పరిస్థితి చూసి భయపడుతున్నారు. తమ పిల్లలు ఇక్కడ చదివించలేం, తమ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. కాగా రెగ్యులర్ వార్డెన్ ఇక్కడ లేకపోవడంతో ఎస్‌జీటీ అధ్యాప కులతో రెండు నెలలకు ఒకరు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. దీంతో బాలికల సంక్షేమం, భద్రత పూర్తిగా లోపించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాత్రి వేళ్లలో పిల్లలు వద్ద ఎవరు ఉంటున్నారో అర్థంకాని పరిస్థితులు ఉన్నాయని తల్లిదండ్రులు ఆందోళన పడుతున్నారు. పాఠశాలకు ఆనుకుని సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతం ఉండడంతో రాత్రివేళ సరైన రక్షణ లేక పిల్లలు బిక్కుబిక్కుమంటు జాగారం చేస్తున్నారని తల్లిదం డ్రులు వాపోతున్నారు.

విద్యార్థినులతో పారిశుధ్య పనులు

సరుబుజ్జిలి: వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇటీవల మూడో తరగతి విద్యార్థిని బిడ్డిక రిస్మిత మలేరియా జ్వరంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం ఆశ్రమ పాఠశాల పరిశీలిస్తారన్న సమాచారం మేరకు అక్కడ సిబ్బంది సోమవారం పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. అయితే రెండో పూట పాఠ్యాంశాల బోధన ఆపేసి విద్యార్థినులతో పారిశుధ్య పనులు చేపట్టడంపై పలువురు తల్లిదం డ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆశ్రమ పాఠశాల బాలికలతో పారిశుధ్య పనులు నిర్వహణపై మెళియాపుట్టి ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి వద్ద ప్రస్తావించగా ఎన్ని ఆదేశాలు ఇచ్చినా హెచ్ఎం తీరులో మార్పు రాకపోవడం శోచనీయమని తెలిపారు.


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థినులు

గాయపడిన యువకుడి మృతి


దుర్గాప్రసాద్ (ఫైల్)

నరసన్నపేట: పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన చిన్ని దుర్గాప్రసాద్ (20) రోడ్డు ప్రమాదంలో గాయపడి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దుర్గాప్రసాద్ ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో శ్రీకాకుళం నుంచి ద్విచక్రవాహనంపై నరసన్నపేట వస్తుండగా మడపాం వంతెన దాటిన తర్వాత ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని శ్రీకాకుళం వెళ్లే రోడ్డుపైకి వచ్చి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడ్ని హైవే అంబులెన్స్ వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. దుర్గాప్రసాద్ పట్టణంలోని ఒక జిమ్‌లో శిక్షకుడిగా పనిచేస్తున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు చెబుతున్నారు.

కొర్రాయి గేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి..

హరిపురం: మందస మండలం కొర్రాయిగేటు వద్ద హైవే అండర్‌పాసేజీ బ్రిడ్జి కింద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పరిశీలించామన్నారు. ఎలా మృతి చెందింది తెలియరాలేదన్నారు. మృతుడి జేబులో ముకేష్, సామాజిక ఆసుపత్రి, చంద్రగిరి పేరుతో ఓపీ షీటు ఉందన్నారు. సుమారు 45 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మృతదేహాన్ని గుర్తించిన వారు మందస పోలీసుస్టేషన్‌కు సంప్ర దించాలని కోరారు.

ఎలక్ట్రికల్ దుకాణంలో అగ్నిప్రమాదం

● పెట్రోల్ పోసి నిప్పంటించారని బాధితుడి ఆరోపణ

హరిపురం: హరిపురం మెయిన్‌రోడ్‌లో వెంకటసాయి ఎలక్ట్రికల్స్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎలక్ట్రికల్ సామగ్రి, మోటార్లు, పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అర్ధరాత్రి దాటిన తర్వాత దుకాణంలో అగ్నిప్రమాదం జరిగి మంటలు వ్యాపించాయి. ఈ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న హెచ్‌సీ శేఖర్ అటువైపుగా వెళ్తుండగా మంటలను చూసి స్థానికులతోపాటు దుకాణం యజమానికి ఫోన్ చేసి విషయం తెలిపారు. అనంతరం అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి తలుపులు పగులగొట్టి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే దుకాణంలోని సామగ్రి అంతా అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా దుకాణం యజమాని జగన్నాథపురం పురుషోత్తం మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ బాటిల్‌ను లోపలకు విసిరి నిప్పు పెట్టారని, ఇది కక్షతోనే చేశారని ఆరోపించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ అనిల్‌కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత ఇసుకతో తీరనున్న సామాన్యుడి ఇంటి కల

అరసవల్లి: ఎన్నికల హామీల్లో ప్రకటించిన విధంగా ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని ప్రకటించడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు సామాన్యుడి ఇంటి కల నెరవేరనుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ఇచ్చిన మాట ప్రకారం ఉచిత ఇసుకను అందించిన చంద్రబాబు నిర్ణయం హర్షణీయమన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సామాన్యులు ఎవరూ చిన్న ఇంటిని నిర్మించుకోవడానికి కూడా వీల్లేని పరిస్థితులు ఉండేవని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 25 రోజుల్లోనే పెంచిన పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందించారని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజలు పెట్టుకున్న ఆశలు, నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు పరిపాలన ఉంటుందన్నారు.

అదనపు భవనాల కోసం ఎంపీకి వినతి

ఎచ్చెర్ల: అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాలకు అదనపు భవనాల నిర్మాణానికి అవసరమైన నిదులు మంజూరు చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును గ్రామ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు డొంక నాగేశ్వరరావు, షేక్ అబ్దుల్లా కోరారు. రణస్థలంలో ఎంపీని కలిసిన వీరు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఎంపీ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అదనపు భవనాల కోసం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల టీడీపీ దళిత నేత కుప్పిలి పోలయ్య పాల్గొన్నారు.


కలిశెట్టికి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

సిక్కోలు సుందరీకరణకు కృషి

శ్రీకాకుళం అర్బన్: సిక్కోలు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. నగర సుందరీకరణలో భాగంగా సోమవారం శ్రీకాకుళంలోని పలు కూడళ్లలో కమిషనర్ పర్యటించారు. పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అలాగే నగరంలో కుక్కల బెడద అధికంగా ఉండడంతో ఖాజీపేటలో ఉన్న డాగ్ షెడ్‌ను కమిషనర్ సందర్శించారు. కుక్కలను సంతాన నిర్మూలన శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ వెంకట్రావు, నగరపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో వైఎస్ఆర్ జయంతి

గార: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సోమవారం శ్రీకూర్మంలో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు అంబటి కృష్ణ ఈ సందర్భంగా వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

టెక్కలి: దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం స్థానిక ఇందిరా గాంధీ కూడలి వద్ద కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ నాయకులు పొట్నూరు ఆనందరావు, మూర్తి, సూర్యకుమారి, గోరిం ట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గార: అంబటి కృష్ణ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

● **జలుమూరు:** దివంగత మాజీ సీఎం రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు మామిడి సత్యనారాయణ అన్నారు. వైఎస్ జయంతి పురస్కరించుకొని గంగాధరపేట కూడలిలోని ఆయన విగ్రహానికి సోమవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో భేరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లఖినేని సాయిరాం, బొత్స వెంకటరమణ, సనపల వాసుదేవరావు, అప్పారావు, పూజారి త్రినాధరావు, పప్పల అప్పారావు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఫ్లైఓవర్ దిగువన ఉన్న వైఎస్ విగ్రహానికి మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పూలమాలల వేసి నివాళులర్పించారు.

● **ఇచ్ఛాపురం:** పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ అలీంఖాన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి నిర్వహించారు. విజయస్తూపం వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పాత బస్టాండ్ జంక్షన్ వద్ద గల వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలిటెక్నిక్ విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్

ఎచ్చెర్ల: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో చదువుతున్న విద్యార్థినులకు ప్రగతి స్కాలర్‌షిప్స్ మంజూరైనట్టు ప్రిన్సిపాల్ జి.గోవిందనాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ప్రతి ఏడాది పదో తరగతిలో నైపుణ్యం చూపించిన విద్యార్థినులకు ఏడాదికి రూ.50 వేలు చొప్పున స్కాలర్‌షిప్స్ అందిస్తున్నట్టు చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు ప్రగతి స్కాలర్‌షిప్స్ అర్హత సాధించారన్నారు. అలాగే మరో 13మంది విద్యార్థినులకు రెండో ఏడాది రెన్యువల్ స్కాలర్‌షిప్స్ అందిందన్నారు.

శుక్రవారం డ్రైడేగా పాటించాలి

కలెక్టరేట్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతీ శుక్రవారం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైడేగా పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో శుక్రవారంతోపాటు ప్రతీ మంగళవారం తమ కార్యాలయం లేదా సం స్థల పరిధిలో పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేయాలన్నారు. దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ తమ వంతు బాధ్యత పోషించాలన్నారు. జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో పారిశుధ్యం పర్యవేక్షించేందుకు ప్రత్యేకాధికారులను నియమించాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

ఎట్టకేలకు ఉపాధి పనులు ప్రారంభం

పొందూరు: గోకర్ణపల్లి గ్రామంలో కొన్నేళ్లగా ఉపాధి పనులకు నోచుకోని ఒక వర్గానికి చెందిన వేతనదారులకు ఎట్టకేలకు అధికారులు పనులు మంజూరు చేశారు. దీంతో నూకమ్మ చెరువులో ఉపాధి పనులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగ ఆధ్వర్యంలో కూలీలు ఎంపీడీవో సూర్యనారాయణకు, ఏపీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన అధికారులు చెరువులో పూడికతీత పనులు మంజూరు చేశారు. దీంతో సోమవారం ఉపాధి పనులు ప్రారంభించారు.

కళాశాల ఏర్పాటు చేయాలి

ఎచ్చెర్ల: పొన్నాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానిక స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. పొన్నాడ, బొంతలకోడూరు, ధర్మవరం, ముద్దాడ, కొత్తపేట కిల్లిపాలెం, ఇప్పిలి, పెదగనగల్లపేట గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పొన్నాడలో జూనియర్ కళాశాల ఏర్పాటైతే ప్రయోజనం కలుగుతుందన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఎచ్చెర్ల: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్-7 ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత, ఎన్ఎస్ఎస్ పీవో ఎం.అనూరాధ, హాస్టల్ చీఫ్ వార్డెన్ ఎన్.లోకేశ్వరి, పీడీ కె.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో టి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

అరసవల్లి: జిల్లాలో మహిళల అభ్యున్నతి కోసం 100రోజుల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మిషన్ శక్తి సంకల్ప్ (మహిళా సాధికారత కేంద్రం), భారతీయ న్యాయ సంహిత తదితరులు వాటిపై అవగాహన కల్పించడానికి జూన్ 21వ తేదీ నుంచి అక్టోబరు 4 వరకు క్షేత్ర స్థాయిలో ర్యాలీలు, సదస్సులు, శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, నోడల్ అధికారి మణెమ్మ, ఈవో ఆదిలక్ష్మి, కేవీ రమణ, సీనియర్ సహాయకులు రామారావు, మెట్ట మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర కల్పించాలి

సోంపేట: జీడికి మద్దతు ధర కల్పించాలని, ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు మోహనరావు, కమిటీ సభ్యులు కె.నాగమణి డిమాండ్ చేశారు. మామిడిపల్లిలోని గానుగుల తరుణాచారి స్మారక విజ్ఞాన కేంద్రంలో సీపీఎం మండల కన్వీనర్ సంగారు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పాతిన కృష్ణమూర్తి, జుత్తు సింహాచలం, తెప్పల పాపారావు, కర్రి సింహాచలం పాల్గొన్నారు.

బుజ్జి మృతి టీడీపీకి తీరని లోటు

ఆమదాలవలస: టీడీపీ నాయకుడు బత్తుల లక్ష్మణరావు (బుజ్జి) మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. ఆదివారం డయేరియా లక్షణాలతో లక్ష్మణరావు మృతి చెందిన విషయం విదితమే. సోమవారం మండలంలోని వెదుళ్లవలసలోని బుజ్జి నివాసానికి రవికుమార్ వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ పట్టణాధ్యక్షు డు సంపతిరావు మురళి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వండాన ఉదయ్‌కుమార్, మాజీ సర్పంచ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

తాగునీరు అందించండి

ఆమదాలవలస: ప్రజలకు తాగునీరందించడానికి నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళంలో ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చేతిపంపులు, రక్షిత మంచినీటి పథకాలు, జలజీవనమిషన్ మిషన్ తదితర తాగునీటి వసతులపై ప్రస్తుత పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు జరిగితే ప్రజలకు నిత్యావ సరంగా మారిన ఇసుక ఉచితంగా ఇస్తామని ఎన్నికల హామీనిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు.

వరుణుడి కరుణ కోసం..

జి.సిగడాం: వరుణుడి కరుణ కోసం కప్పకు పూజలు చేశారు వెల గాడ గ్రామస్థులు. చెరువులో ఉన్న కప్పను పట్టి గ్రామంలోకి తీసుకువచ్చి పసుపు కుంకుమలతో పూజిం చారు. పూల దండలతో అలకరిం చి జోలి కిట్టి పాటలు పాడుతూ పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం కప్పకు చెట్టుకింద పూజల చేసి చెరువులోనే కప్పను విడిచిపెట్టారు. కాగా సాయంత్రం కాస్తంత వర్షం పడడంతో ఆనందం వ్యక్తం చేశారు.


కప్పకు పూజ చేస్తున్న దృశ్యం